జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
ఆదివారం 31-05-2026
జిల్లా వార్తలు
WWW.DASHANEWS.COM

# చదువే ప్రపంచాన్ని మార్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం: మంత్రి సీతక్క

- *అంగన్వాడీల బలోపేతం నుంచి బాలికల సాధికారత వరకు ప్రజా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ.*
- *రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మహిళా వారోత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి సీతక్క.*



**దశ, హైదరాబాద్:** "ప్రపంచాన్ని, జీవితాన్ని మార్చే శక్తి చదువుతోనే సాధ్యమవుతుంది. ఒకవేళ జీవితంలో అన్నీ కోల్పోయినా చదువు ఉంటే మళ్లీ నిలబడగలుగుతాం" అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. బాలికలు కార్పొరేటర్లు, మేయర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కావాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నెల్సన్ మండేలా చెప్పిన ప్రపంచాన్ని మార్చే శక్తి విద్యకు ఉంది అనే సూక్తిని ప్రస్తావించిన మంత్రి, చదువుతో పాటు సంస్కారం కూడా జీవితంలో అంతే ముఖ్యమని తెలిపారు. శనివారం కొంగరకలాన్లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో మహిళా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్నేహ సంఘాల మాక్ పార్లమెంట్, "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం, అంగన్వాడీ యూనిఫార్ముల పంపిణీ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తల్లిదండ్రులను, గురువులను గౌరవించడం, సమాజంతో మమేకం కావడం, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడం అవసరమని సూచించారు. స్నేహ సంఘాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది టీనేజీ బాలికలను పదివేలకు పైగా స్నేహ గ్రూపులుగా ఏర్పాటుచేసి భద్రత, ఆరోగ్యం, పోషకాహారం, విద్య, సాధికారత అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ, ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కూడా సీతక్క అసెంబ్లీలో చేసిన చర్చలు అధికారులను ఆలోచింపజేసేవని గుర్తుచేశారు. గ్రామస్థాయిలో బాలికలు తమ సమస్యలను ధైర్యంగా వ్యక్తపరిచే వేదికగా స్నేహ సంఘాలు నిలుస్తున్నాయని తెలిపారు. మహిళల అక్షరాస్యత పెంపు కోసం చేపట్టిన "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ద్వారా లక్షలాది మంది మహిళలు చదవడం, రాయడం నేర్చుకుని వేలిముద్రకు బదులుగా సంతకం చేసే స్థాయికి చేరుకున్నారని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,మహిళా కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, శాఖ డైరెక్టర్ శృతి ఓజా, పంచాయతీరాజ్ కమిషనర్ మరియు సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి, జిల్లా అధికారులు, స్నేహ సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు

## వరి కొయ్యలను కాల్చకండి. పర్యావరణాన్ని పాడు చేయకండి.

- *అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** రైతులు వరి పంట కోసిన తర్వాత పొలం పై ఉన్న వరి కొయ్యలను కాల్చడం వల్ల అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని, అందువల్ల ఎవరు వరి కొయ్యలను తగలబెట్టవద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విజ్ఞప్తి చేశారు. శనివారం అయన సూర్యాపేట మండలం కాసారాబాద్ గ్రామంలో వరి కొయ్యలను తగలబెట్టొద్దని రైతులకు అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.నరసింహతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరికోయ్యలు తగలబెడితే భూమి సారవంతం కోల్పోతుందని, అనంతరం దుక్కి దున్నినప్పటికీ గుల్లగా మారదని, దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందని అన్నారు. సాంద్రత పెంచుకునేందుకు అధిక ఎరువులు వాడాల్సి వస్తుందని ఆ భారం కూడా రైతుల పైన పడుతుందని తెలిపారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రహదారులపై వెళ్లే వాహనదారులకు కూడా ఇబ్బందులు ఏర్పడతాయని, వరి కొయ్యల వల్ల పక్కన ఉన్న చెట్లు, ఇతర విలువైన వస్తువులు పరికరాలు తగలబడే అవకాశం ఉందన్నారు.

జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ వరి కొయ్యలను పొలం పైన తగలబెట్టడం వల్ల పర్యావరణ సమతుల్యం దెబ్బతినడమే కాకుండా, భూములు సారవంతం కోల్పోతాయని, అందువల్ల ఎవరు తగలబెట్టవద్దని చెప్పారు . ఎవరైనా ఇలా వరి కొయ్యలు తగలబెట్టడం వల్ల ప్రమాదాల సంభవిస్తే అందుకు బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఎసిపి ప్రసన్న కుమార్, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ బాలకృష్ణ, ఎడిఎ జ్ఞానేశ్వరి, ఎ ఓ కృష్ణ సందీప్, సర్పంచ్ బూపాల్ రెడ్డి ఇతర అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు అప్ గ్రేడ్ కావాలి: హరీష్ రావు




**దశ, సిద్దిపేట:** సిద్దిపేటలో ఫోటోగ్రాఫర్లకోసం ఏర్పాటు చేసిన వెడ్డింగ్ ఫోటోగ్రఫీ బిజినెస్ వర్క్ షాప్ కు మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. హరీష్ రావు మాట్లాడుతూ వంద మాటలు చెప్పలేని భావాన్ని, సారాంశాన్ని ఒక అద్భుతమైన ఫోటో చెబుతుంది. ఫోటోగ్రఫీకి సమాజంలో అంతటి గొప్ప విలువ ఉందని అన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ మారి ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు వచ్చాయి. ఫంక్షన్లలో అందరూ సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటున్నప్పటికీ.. ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ వృత్తికి ఉన్న డిమాండ్ ఎప్పటికీ తగ్గదు, దానికి ఎప్పుడూ మంచి భవిష్యత్తు ఉంటుంది. ఆర్టీఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి కొత్త టెక్నాలజీలు వస్తున్న తరుణంలో సాఫ్ట్వేర్ ఇంజనీర్లు, డాక్టర్లు, లాయర్లు, రాజకీయ నాయకులు సైతం ఎప్పటికప్పుడు అప్గ్రేడ్ అవుతున్నారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా ఫోటోగ్రాఫర్లు కూడా తమ నైపుణ్యాలను అప్గ్రేడ్ చేసుకోవాలి, లేకపోతే వెనుకబడిపోతారు. మీ నైపుణ్యాలను పెంచేందుకు ఏర్పాటు చేసిన ఈ వర్క్ షాప్ ను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. సిద్దిపేటలోని కోమటి చెరువు, రంగనాయక సాగర్ వంటి సుందరమైన ప్రాంతాలు ఇప్పుడు ఫోటోషూట్లకు కేరాఫ్ అడ్రస్గా మారి, ఎప్పుడూ కళకళలాడుతున్నాయి. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో మార్కెట్లో డబ్బుల చెలామణి ఆగిపోయింది. తెలంగాణ రాష్ట్రంలో ఫోటోగ్రాఫర్లకు ప్రభుత్వ స్థలం ఇచ్చి, ప్రభుత్వ నిధులతో ప్రత్యేకంగా ఒక భవనం నిర్మించిన ఏకైక ప్రాంతం మన సిద్దిపేట మాత్రమే. ఆ భవనానికి సంబంధించి మిగిలి ఉన్న కొద్దిపాటి పనులను కూడా త్వరలో పూర్తి చేసి, పూర్తిగా వినియోగంలోకి తీసుకొస్తాము. ఫోటోగ్రాఫర్లకు ఉచిత ఓపీ సేవలు అందించే ఉద్దేశంతో హెల్త్ కార్డులు పంపిణీ చేయడం చాలా సంతోషకరం. ఈ కష్టకాలం పోయి ఫోటోగ్రాఫర్లకు మళ్లీ మంచి రోజులు రావాలని, వ్యాపారం బాగా జరిగి మీరంతా ఆర్థికంగా స్థిరపడాలని ఆ దేవుడ్ని ప్రార్థిస్తున్నానని అన్నారు.



## గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ ఈ. సుధాకర్ మృతి



**దశ, హయత్నగర్ :** హయత్నగర్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ E. సుధాకర్ (55) గుండెపోటుతో ఆకస్మికంగా మరణించడం తీవ్ర విషాదానికి గురిచేసింది. శుక్రవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఆయనకు గుండెపోటు రావడంతో కన్నుమూశారు. 1993 బ్యాచ్ (NLG) కు చెందిన సుధాకర్ గారు పోలీసు శాఖలో నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తించి సహచరుల అభిమానాన్ని సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఆయన సూర్యాపేట టౌన్లో తన భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. ఈ సందర్భంగా హయత్నగర్ పోలీస్ స్టేషన్ తరపున కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అలాగే ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.30 వేల ఫ్యూనరల్ అసిస్టెన్స్ను కుటుంబ సభ్యులకు అందజేశారు. సుధాకర్ గారి ఆత్మకు శాంతి చేకూరాలని సహచర పోలీసులు ఘన నివాళులు అర్పించారు.

## సహకార బ్యాంకులకు చెల్లింపులే ఊపిరి



- *మొండి బకాయిదారులపై చట్టపరమైన చర్యలకు బాటసింగారం రైతు సంఘం గ్రీన్సిగ్నల్*



**దశ, అబ్దుల్లాపూర్మెట్ :** సహకార బ్యాంకుల ఆర్థిక స్థిరత్వానికి రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి చెల్లించడం ఎంతో అవసరమని, ఏళ్ల తరబడి బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న మొండి బకాయిదారులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ ఫంక్షన్ హాల్లో శనివారం జరిగిన సంఘం 58వ సర్వసభ్య సమావేశం సంఘం చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సహకార బ్యాంక్ మేనేజర్ జక్కుల ఐలేష్ బ్యాంకు పనితీరు, రుణాల వసూళ్లు, ఆర్థిక పరిస్థితులపై నివేదికను ప్రవేశపెట్టారు. చైర్మన్ కొత్తపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ, కొంతమంది రైతులు రుణాలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకులపై ఆర్థిక భారం పెరుగుతోందని తెలిపారు. దీని ప్రభావం నిజంగా అవసరమైన రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయడంపై పడుతోందని పేర్కొన్నారు. బ్యాంకు అభివృద్ధి కోసం మొండి బకాయిల వసూళ్లలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. సకాలంలో రుణాలు చెల్లించే రైతులకు త్వరితగతిన కొత్త రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి సహకారంతో బ్యాంకును మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. రైతులు అందరూ బాధ్యతగా వ్యవహరించి సహకార బ్యాంకు అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, సహకార బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని సంవత్సరాలుగా తిరిగి చెల్లించని వారి వల్ల నిజమైన రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సమావేశానికి మొండి బకాయిదారుల పూర్తి జాబితాను సభలో ఉంచి, సహకార చట్టాల ప్రకారం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద బకాయిదారుల పేర్లతో నోటీసులు ప్రదర్శించాలని కూడా కోరారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ బింగి దాస్ గౌడ్, మాజీ చైర్మన్ చేగూరి భరత్, పురం యాదిరెడ్డి, డైరెక్టర్లు గంట శ్రీనివాస్ రెడ్డి, ఇటికెల మహేందర్ రెడ్డి, కందాడి మహిపాల్ రెడ్డి, మొగుళ్ల చిన్న యాదిరెడ్డి, నార్లకొంట మల్లమ్మ జంగమయ్య, మేకల రాములు, చింతల లక్ష్మమ్మ, తగుండె బాలనర్సమ్మ, బిజిలి బాలనర్సయ్య, సర్పంచ్లు మందుగుల విజయ శ్రీశైలం గౌడ్, కోట ప్రభాకర్ రెడ్డి, కోలన్ ప్రసన్నలక్ష్మి రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్లు మూల మహేష్ గౌడ్, వడ్డెపల్లి పాపయ్య గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డల ముఖంలో ఆనందం... ప్రతి ఇంటా కళ్యాణ వైభోగం...

- *ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి*

**దశ, రంగారెడ్డి :** కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని... ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచే గొప్ప కార్యక్రమంగా ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అభివర్ణించారు. మంచాల మండలానికి చెందిన 53మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఆయన అందజేశారు. ఆడబిడ్డల వివాహం కష్టాలతో జరగకుండా, ఆనందోత్సాహాల నడుమ జరగాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు.








## గేటెడ్ కమ్యూనిటీ వాసులకు పోలీసుల అవగాహన కార్యక్రమం

**దశ, హయత్నగర్ :** ప్రజల భద్రతే లక్ష్యంగా చేపడుతున్న "మీ సురక్ష మా బాధ్యత" కార్యక్రమంలో భాగంగా ఈరోజు సాయంత్రం కుంట్లూర్లోని ప్రజయ్ గుల్మోహర్ గేటెడ్ కమ్యూనిటీలో పోలీసు అధికారులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హయత్నగర్ ఎస్హెచ్ఓ నాగరాజు హయత్నగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లో పనిచేస్తున్న వాచ్మెన్లు, మైదులు, డ్రైవర్లు మరియు ఇతర వర్కర్ల పూర్తి వివరాలను పోలీస్ శాఖ అందించిన గూగుల్ లింక్లో తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని నివాసితులకు సూచించారు. ఇలా చేయడం ద్వారా అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచడంతో పాటు నేరాల నియంత్రణకు సహాయపడుతుందని అధికారులు తెలిపారు. అలాగే, కమ్యూనిటీల్లో సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చూసుకోవాలని, అపరిచితుల రాకపోకలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమానికి గేటెడ్ కమ్యూనిటీ వాసులు మంచి స్పందన తెలిపారు.






## BRS నయకురాలు కాసాని పద్మ పర్యటన



**దశ, అశ్వారావుపేట:** అశ్వారావుపేట మాజీ ఎంపీపీ శ్రీరామమూర్తి BRS నాయకురాలు కాసాని పద్మ చంద్రమోహన్ దంపతులు శనివారం పరామర్శించారు. ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న శ్రీరామమూర్తి గారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, ఆయన త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్ డా. ఉదయజ్యోతి, డా. ప్రసాద్, మోటూరి మోహన్, జీవనరావు, రాజనాల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. శ్రీరామమూర్తి గారికి ధైర్యం చెబుతూ మెరుగైన ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్య ఉండాలని ఆకాంక్షించారు.

## మేముసైతం మిత్రమండలి ట్రస్ట్ వితరణ

**దశ, మణుగూరు:** మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా పెద్ద దిక్కును పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంలో ఉండి చనిపోయారు. పేద కుటుంబాలకు మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలవాలని వారి కష్టాల్లో కొంతైనా పాలు పంచుకోవాలనే సదుద్దేశంతో చనిపోయిన కుటుంబాలను ఆదుకోవడానికి మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి ట్రస్ట్ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దానిలో భాగంగా మణుగూరు మండలం సమితిసింగారం గ్రామపంచాయతీ కేసీఆర్ డబల్ బెడ్రూం ప్రాంతానికి చెందిన ఇరపా నగేష్ వయసు (45) అనారోగ్యంతో శనివారం మరణించారు. వీరిది నిరుపేద కుటుంబం ఇది తెలిసి మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ స్పందించి రాయల ప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ.3 వేల రూపాయలు దహన సంస్కారాల కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ మార్తి శ్రీనివాసరావు, ట్రస్ట్ సభ్యులు P జగన్ మోహన్, చిందుకూరి రామారావు, బిక్షపతి గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



**దశ, ఖమ్మం:** ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాధ్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో బి.నాగేశ్వర్ రావు, SI WPS, N.ఉప్పయ్య, ASI ఖమ్మం II టౌన్, M.గురునాథం, ASI ముదిగొండ, P. ప్రకాష్ రావు, HC మదిర టౌన్, పి.లక్ష్మణ్ రావు (ఎస్సై కమ్యూనికేషన్) కార్యక్రమంలో ఏఆర్ఏసీపీ నర్సయ్య, ఆర్.ఐలు కామరాజు, అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం



❖ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**దశ, మణుగూరు:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మణుగూరు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల తహసీల్దార్లు (ఎంఆర్వోలు), ఎంపీడీవోలు, హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా మొదటి విడత ఇళ్ల నిర్మాణాల ప్రగతి, లబ్ధిదారుల వివరాలు, నిధుల విడుదల ప్రక్రియ తదితర అంశాలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, రాష్ట్ర కేబినెట్ నిర్ణయం మేరకు జూన్ 1వ తేదీ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభం కానుందని, పినపాక నియోజకవర్గానికి అదనంగా మరో 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు, స్థలం లేని వారికి స్థలంతో పాటు గృహ నిర్మాణ నిధులు కూడా ప్రభుత్వం అందజేస్తుందని వివరించారు. నియోజకవర్గం లోని పేద ప్రజలు సొంత ఇంటి కలను నెరవేర్చుకుంటూ సంతోషంగా గృహప్రవేశాలు జరుపుకోవడం తనకు ఎంతో తృప్తిని ఇస్తోందన్నారు. అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ, రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్మాణాల పురోగతిని జియో ట్యాగింగ్ ద్వారా పర్యవేక్షిస్తూ, నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేగంగా జమ అయ్యేలా చూడాలని సూచించారు. గిరిజనులు, నిరుపేదలు, అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో హౌసింగ్ శాఖ అధికారులు, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు భరోసా కల్పించిన ఎమ్మెల్యే పాయం

**దశ, పినపాక:** పాండురంగాపురం పంచాయతీ పరిధిలోని ఇప్పలగుంపు గ్రామంలో ఇటీవల జరిగిన ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదంలో తీవ్రంగా నష్టపోయిన గొగ్గెల అబ్బయ్య మరియు కొమరం రాంబాబు కుటుంబాలను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యక్షంగా పరామర్శించారు. అగ్ని ప్రమాదం కారణంగా నివాస గృహాలు, గృహోపకరణాలు మరియు ఇతర విలువైన వస్తువులు అగ్నికి ఆహుతై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబ సభ్యులను కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితుల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వారికి ధైర్యం చెబుతూ, కష్టకాలంలో ప్రభుత్వం మరియు తాను ఎల్లప్పుడూ



అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహాలు మంజూరు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే తక్షణ అవసరాల కోసం స్వయంగా ఆర్థిక సహాయం అందజేసి మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టాన్ని అంచనా వేయించి, ప్రభుత్వ పరంగా అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు ఎలాంటి ఆపదలో ఉన్నా వారి పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మాజీ సర్పంచ్ తోటలో పామాయిల్ మొక్కల నరికివేత

❖ భాద్యులపై చర్యలు తీసుకోవాలన్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు

**దశ, అశ్వారావుపేట:** అధికార మదంతో కాంగ్రెస్ నాయకులు కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు అన్నారు. అశ్వారావుపేట మండలం మల్లయిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నారం రాజశేఖర్ తనకున్న 5 ఎకరాల పట్టా భూమిలో పామాయిల్ మొక్కలు నాటగా, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మొక్కలను దారుణంగా రాత్రికి రాత్రే నరికివేసి విధ్వంసం సృష్టించాడు. రాజకీయ కక్షతోనే కష్టపడి పెంచుకుంటున్న తోటను నాశనం చేయడం పట్ల స్థానికంగా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ MLA, BRS పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో కలిసి శనివారం మల్లయిగూడెం చేరుకుని, నరికివేసిన పామాయిల్ తోటను పరిశీలించారు. బాధితుడు నారం రాజశేఖర్ కు పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా అధికార పార్టీ నాయకుల తీరుపై వారు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజలు ఓట్లు వేసి రాజకీయంగా గెలిపించింది పనులు చేయడానికి తప్ప, ఇలాంటి విధ్వంసాలు సృష్టించడానికి కాదని..ఎవరూ ఇక్కడ శాశ్వతంగా అధికారంలో ఉండరు అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి అని గత BRS ప్రభుత్వంలో ఎన్నడు ఇలాంటి విధ్వంసాలు లేవని ప్రశాంతంగా నియోజకవర్గం ఉండేదని కాంగ్రెస్ గెలిచిన రోజు నుంచి ఎక్కడ చూసినా దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఈ దౌర్జన్యాలకు దాడులకు పాల్పడుతున్నవారికి భవిష్యత్తులో గట్టి సమాధానం చెప్తామన్నారు. వెంటనే పంటను నాశనం చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లేనిఎడల ధర్నాకు సిద్ధమవుతామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ZPTC జూపల్లి రమణారావు, మోహన్ రెడ్డి, సంక ప్రసాద్, మాజీ ZPTC సున్నం నాగమణి, కిషోర్, ఈదర రాంబాబు, చందా కుమార స్వామి, దుర్గ రావు, రాజా రావు, శివకాంత్, అనిల్, హేమంత, నరసింహారావు, సుధాకర్, సున్నం కృష్ణ, సంజయ్, వెంకన్న బాబు, తదితరులు ఉన్నారు.

## VOAల సమస్యలు పరిష్కారించాలి



**దశ, చంద్రుగొండ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజకవర్గం చంద్రుగొండ తహసీల్దార్ కార్యాలయం ముందు VOAల సమ్మెకు BRS పార్టీ చంద్రుగొండ మండల అధ్యక్షులు దారా వెంకటేశ్వరావు శనివారం మద్దతు తెలిపారు. VOAల సమస్యలు పరిష్కారం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎం.పి.పి నరుకుల్ల సత్యనారాయణ, సొసైటి వైస్ చైర్మన్ నల్లమోతు వెంకటనారాయణ, టౌన్ పార్టీ అధ్యక్షులు 2వ వార్డ్ సభ్యులు సూరా వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు మెడ మోహనరావు, నరుకుల్ల వాసు, గాదె లింగయ్య, నరుకుల్ల అప్పాజి, భూపతి రమేష్, వైస్ సర్పంచ్ బడికల శ్రవణ్ కుమార్, కల్లెం వెంకటేశ్వర్లు, మల్లెం వెంకటేశ్వర్లు, మహమ్మద్ జాని, (చోటు)కేలోత్ శ్రీను, కాకటి జగన్నాథం, ఉగ్గం శ్రీను, రామరాజు, అంచ కృష్ణ, జానపాటి అనిల్, అల్తాఫ్, సుదీర్, కొండా, వంశి, రాజా, తలారి నాగరాజు, కొండ్రు రాజు, యలమందల కిట్టు తదితరులు పాల్గొన్నారు.

## ఓసి ఫోర్ దుర్గ కంపెనీ మేనేజ్మెంట్ తీసివేసిన ఐదుగురు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

❖ మణుగూరు సింగరేణి GMను కలిసిన అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

**దశ, మణుగూరు:** మణుగూరు ఓసి ఫోర్ దుర్గ మేనేజ్మెంట్ తీసివేసిన ఐదుగురు కార్మికులను వెంటనే వీధిలోకి తీసుకోవాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై శనివారం అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు సింగరేణి జీఎం గారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు వై.రాంగోపాల్ (AI TUC), పి.వీరభద్రం (INTUC), ఊకంటి ప్రభాకర్ (TBGKS), జి.శ్రీను(CITU), ఆర్.మధుసూదన్ రెడ్డి (TUCI), ఆంగోత్ మంగీలాల్ (IFTU), అమీనుద్దీన్ (TNTUC) మాట్లాడుతూ.. మా వేతనాలు సకాలంలో చెల్లించ కార్మికులను టార్గెట్ చేసి విధుల నుండి తొలగించడం అన్యాయం అన్నారు. ఈ ప్రాంతంలో భూములు కోల్పోయి, పొల్యూషన్ భారిన పడుతూ ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది




పడుతుంటే స్థానికులకు ఉపాధి కల్పించవలసిన ప్రైవేట్ కంపెనీలు స్థానికేతరులను తీసుకొని స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదన్నారు. జీతాలు సకాలంలో చెల్లించమని అడిగితే కార్మికులను అక్రమంగా తొలగిస్తూ మేనేజ్మెంట్ నియంతలాగా వ్యవహరిస్తుందన్నారు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలన్నారు. ఈ విషయం స్థానిక సింగరేణి జిఎం గారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, స్థానికులకు 80% ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం. వెంకటేశ్వర్లు, సురేందర్, రాంబాబు, అమీనుద్దీన్, వరదల సమ్మయ్య అప్పారావు సార బాబు, లింగరాజు, ఎండి మున్వారుద్దీన్, తదితరులు పాల్గొన్నారు